క్లుప్తంగా

మహిళల వీరోచిత పోరాటంలో పీఓడబ్ల్యూ పాత్ర కీలకం

రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల



పులిమేరులో ర్యాలీ నిర్వహిస్తున్న స్త్రీ విముక్తి నాయకులు, రైతుకూలీలు

పెద్దాపురం: ప్రజా ఉద్యమాల్లో మహిళల వీరోచిత పోరాటంలో ప్రగతి శీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ)(స్త్రీ విముక్తి సంఘం)పాత్ర కీలకమని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పులిమేరు గ్రామంలో పీఓడబ్ల్యూ 50 వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపా ఏసమ్మ అధ్యక్షతన జరిగిన సభలో వీరాంజనేయులు మాట్లాడుతూ మహిళ హక్కుల కోసం వీరోచిత పోరాటం సాగించిన సంఘం స్త్రీ విముక్తి సంఘం అన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలంతా ఏకతాటిపైకి వచ్చి మహిళా సాధికారిత కోసం పోరాడాలని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. తొలుత పోరాటంలో అశువులుబాసిన వీర మహిళ మృతిపై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బచ్చల రాఘవమ్మ, దనలక్ష్మి, లక్ష్మమ్మ, సులోచనమ్మ, చక్రమ్మ, కామేశ్వరి, రత్నం, అంజిబాబు, దేశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విలువలు కలిగిన వ్యక్తి సూర్యారావు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

పెద్దాపురం: మానవత్వ విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి యాసలపు సూర్యారావు అని పలువురు వక్తలు అన్నారు. యాసలపు సూర్యారావు 12వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వైఎస్సార్ సీపీ నాయకులు, అప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం కోటి మాట్లాడుతూ సూర్యారావు అందరి మనసులో చిరస్థాయిగా నిలిచేపోయే వ్యక్తిగా మిగిలిరాన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండేవారన్నారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి, నీలపాల సూరిబాబు, కేదారి నాగు, యాసలపు రమేష్, రవి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

280 లీటర్ల సారా స్వాధీనం

ప్రత్తిపాడు: స్థానిక స్పెషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని అక్రమంగా తరలిస్తున్న 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే... శంఖవరం మండలం మాసంపల్లిలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మాసంపల్లి నుంచి జీపులో తరలిస్తున్న 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రౌతులపూడి మండలం పల్లపు చామవరం గ్రామానికి చెందిన ట్రక్ డ్రైవర్ గోరకపూడి సురేష్‌ను అరెస్టు చేశారు. అలాగే మాసంపల్లి గ్రామానికి చెందిన సారా యజమాని వెలుగుల శ్రీనుపై కేసు నమోదు చేశారు. ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో సెబ్ ఎస్సై ఎం.ఆశాలత, సెబ్ హెచ్‌సీ ఎల్.కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్.చిరంజీవి సూచించారు. స్థానిక ప్రగతి, నైపుణ్య డిగ్రీ కళాశాలల్లో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా సెబ్ సీఐ చిరంజీవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు శరీరాన్ని నిర్వీర్యం చేస్తాయన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై ఎం.ఆశాలత, ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 9:30కు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు తెలిపారు. పదిన్నర గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం 0884-2357800 నంబర్‌కు డయల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. అలాగే 10:30 నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం కాకినాడ నగర పాలక సంస్థ మీటింగ్ హాల్‌లో నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు విచ్చేసి ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.

రహదారి కోత.. ప్రజలకు వెత



కెరటాల ఉధృతికి కోతకు గురైన బీచ్ రోడ్డు



గోతులతో ప్రమాదకరంగా మారిన బీచ్ రోడ్డు

- అలల ఉధృతికి సముద్రంలోకి కుంగిపోయిన బీచ్‌రోడ్డు
- తరచూ ప్రమాదాలు

కొత్తపల్లి: నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రజలు ప్రయాణించే ఉప్పాడ బీచ్‌రోడ్డు ప్రమాదకరంగా మారింది. సముద్ర కెరటాల ఉధృతి, ఆటుపోట్లు కారణంగా బీచ్‌రోడ్డు కోతకు గురవుతోంది. ఇప్పటికే కొంత మేర రోడ్డు కోతకు గురై సముద్రంలోకి కుంగిపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తూతూ మంత్రంగా చేస్తున్న మరమ్మతు పనులు రాత్రికి రాత్రే నీటిపాలవుతున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బీచ్‌రోడ్డు నిర్మాణానికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టకపోతే అలల ఉధృతికి పూర్తిగా కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి

- నాగలి పట్టి ఏరువాక సాగిన డాక్టర్ ఉమర్ ఆలీషా



కాడి పట్టి ఏరువాక సాగుతున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: స్థానిక శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆవరణలో శనివారం సస్య వృద్ధి బీజారోపణ ఏరువాక పౌర్ణమి ఉత్సవం నిర్వహించారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఆధ్వర్యంలో ఈ ఏరువాక ఉత్సవం నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది రైతులు పాల్గొన్నారు. పీఠం వ్యవసాయ క్షేత్రంలో డాక్టర్ ఉమర్ ఆలీషా అరక కట్టి, నాగలిపట్టి ఏరువాక సాగారు. దివ్య బీజం, విత్తనాలు, గోకృపామృతం రైతులకు పంపిణీ చేశారు. సేంద్రియ వ్యవసాయం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, జీవరసాయన పదార్థాలు వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు ఎడ్లకు ధాన్యం, బెల్లం తినిపించి పసుపు కుంకుమతో అలంకరించి భారతీయ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం ఏరువాక కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము ప్రకృతి సాగు చేయడం వల్ల కలిగిన ప్రయోజనాలను తోటి రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏవీ రామాంజనేయులు, నీలిమ, ఎం.రామ్ గోపాలవర్మ, రత్నప్రశాంతి, వ్యవసాయాధికారులు సీహెచ్ సత్యనారాయణ, అరుణ తదితరులు సాగులో మిత్ర పురుగుల ద్వారా చీడపీడల నివారణ, డ్రోన్, ఆధునిక వ్యవసాయ పరికరాలు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయంలో మారిన ఆధునిక పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం ఆదర్శ రైతులను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నీరు.. తాగేదెలా సారూ..!

- తాగునీటిలో పురుగులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



కొత్తపల్లిలో కుళాయిల నుంచి వచ్చిన నీటిలో క్రిమి కీటకాలు

కొత్తపల్లి: స్థానిక పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న పబ్లిక్ కుళాయిల కలుషిత తాగునీరు వస్తోంది. కుళాయిల నుంచి వచ్చే నీటిలో క్రిమికీటకాలు, జలగలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు రంగుమారి దుర్వాసన వస్తోంది. ఈ నీరు తాగడానికి ఉపయోగపడడం లేదని ప్రజలు చెబుతున్నారు. ప్రధాన పైపులైన్లు డ్రైన్ల కింద ఉండడం, పలుచోట్ల మరమ్మతులకు గురికావడం తాగునీటి కుళాయిల నుంచి జలగలు, క్రిమికీటకాలు, నాచు వస్తున్నాయని, ఈ నీరు కనీసం వాడుకోవడానికి కూడా పనికిరావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ విజయకుమార్

గొల్లప్రోలు: రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విత్తన, ఎరువుల దుకాణాల నిర్వాహకులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, విశ్వసనీయత కలిగిన కంపెనీల విత్తనాలు మాత్రమే దుకాణాల్లో అమ్మకానికి ఉంచాలన్నారు. విత్తనాల కంపెనీల డీలర్లు మీ వద్దకు వచ్చినప్పుడు వారి నుంచి సరైన హామీ పత్రం తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే రైతులకు కలిగే నష్టాన్ని ఆయా కంపెనీల నుంచి రాబట్టేలా వ్యాపారులు వ్యవహరించాలన్నారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతే ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం రాదని, విత్తన కంపెనీల నుంచే నష్ట పరిహారం రాబట్టాలన్నారు. విత్తన వ్యాపారులు రైతుల పట్ల బాధ్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ పి.స్వాతి, ఏఓ సత్యనారాయణ, గొల్లప్రోలు పట్టణ, మండల విత్తన, ఎరువుల దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే



ఉప్పాడలో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో చేస్తున్న ఫీవర్ సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. వేడి ఆహారాన్ని తినాలని సూచించారు. కలుషితమైన నీటిని తాగితే డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. డయేరియా, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గృహాల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో భారత్ నృత్యోత్సవ్

జగ్గంపేట: కేరళలో ఇటీవల భారత్ నృత్యోత్సవ్ పేరిట 100 రోజుల పాటు జరిగిన నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదైందని జగ్గంపేట నృత్య కళాకారిణి ముళ్లపూడి విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జగ్గంపేటలోని శ్రీసీతారత్నం నృత్య కళావేదికకు చెందిన 96 మంది విద్యార్థులు కేరళలో జరిగిన నృత్యోత్సవంలో పాల్గొన్నారన్నారు. పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారని చెప్పారు. జగ్గంపేట, ధర్మవరం గ్రామాలకు చెందిన విద్యార్థులు 10 రోజుల పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పలు ప్రముఖ దేవాలయాలతో పాటు చివరగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చారని వివరించారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



కొప్పవరంలో పాఠశాలలో చేరడానికి అనుమతి పత్రం అందజేస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శనివారం మండల పరిధిలో అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాల్లో నేడు బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ మేరకు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అమలు జరుగుతున్న పథకాలను వివరించారు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లు, తల్లులతో కలిసిన నేడు బడికి పోతా ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోవడానికి అనుమతి పత్రాలను ఎంఈఓ విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు.

అతిసారపై అప్రమత్తత అవసరం

కాకినాడ సిటీ: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇట్ల కిషోర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా పంచాయతీ రెవెన్యూ గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పని చేయాలని, ముఖ్యంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు తక్షణం శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా నిల్వ పదార్థాలు, నిల్వ ఉంచిన మాంసం వంటి పదార్థాలు తీసుకోవద్దని తెలిపారు. డివిజనల్ స్థాయిలో సీజనల్ వ్యాధులకు సంబంధించి ఏమైనా సమాచారం ఉంటే ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కంట్రోల్ రూమ్ నంబర్ 8008803208 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని ఆర్డీవో కిషోర్ వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

కిర్లంపూడి: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.ఆశయ్య అధ్యక్షతన శనివారం మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సీతారామారావు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో డయేరియ కేసులు నమోదవుతున్నాయన్నారు. అధికారులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సాయిహేమాంజలి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొరబాబు



ఉలిమేశ్వరంలో కాటంశెట్టి దొరబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దొరబాబు

పెద్దాపురం: ఎన్డీయే కూటమి మోసపూరిత విజయం కారణంగా నిస్వార్థ పాలనందించే వైఎస్సార్ సీపీ ఓటమి తట్టుకోలేక మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఉలిమేశ్వరం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాటంశెట్టి దొరబాబు, యండపల్లి మంగాలక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఓటమిని ఏ ఒక్కరూ మనస్ఫూర్తిగా ఒప్పుకోలేరన్నారు. విజయం, అపజయం అనేది ఓటరు చేతిలో ఉందని, ప్రజాతీర్పు తలొగ్గి ఉండడం వల్ల కూటమి నేతలు వైఎస్సార్ సీపీ కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇది ఏ మాత్రం సమంజసం కాదని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎక్కడా అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. తప్పుడు మార్గంలో అందలమెక్కిన వారు తప్పుడుగానే పోతారు తప్ప నిజాయితీ పాలన సాగించలేరన్నారు. వైఎస్సార్ సీపీ ఓటమిని తట్టుకోలేక మంచాన పడి కొందరు, గుండెపోటుతో మరి కొందరూ అసువులు బాసారని, వారందరి కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడు అండగా నిలుస్తుందని దొరబాబు అన్నారు. అనంతరం మృతుల చిత్రపటాల వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గోపు మురళి, ఆకుల వీరబాబు, పంచాది వీర వెంకట సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రోగులకు పరామర్శ



వేట్ల పాలెం గ్రామ శివారు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, డీపీఓ

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో డయేరియా కేసుల సంఖ్య పెరిగిపోవడంతో శనివారం సాయంత్రం డీపీఓ సౌజన్య, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబులు వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. గ్రామ శివారు ప్రాంతంలోని జొన్నలదొడ్డిలో డయేరియా కేసులు నమోదు కావడంతో డీపీఓ ఆ ప్రాంతంలో పరిశీలించారు. అక్కడ ప్రజల నుంచి విషయాన్ని తెలుసుకున్నారు. జొన్నదొడ్డి రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెరువులో నీరు వ్యర్థ పదార్థాలతో నిండిపోవడమే అతిసార వ్యాధికి కారణమని ఆ ప్రాంత ప్రజలు డీపీఓ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటి శ్యాంపిల్ సేకరించాలని మండల స్థాయి అధికారులను ఆమె ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా రోగులను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబుతో కలిసి పరామర్శించారు. రోగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి, సీరియస్‌గా ఉంటే వెంటనే కాకినాడ తరలించాలని ఆదేశించారు. 24 గంటలు డాక్టర్లు, సిబ్బంది అందు బాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, గ్రామ ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, డాక్టర్లు శ్రీహిమవతి, పరదేశ్‌లు పాల్గొన్నారు.

రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



వీధి కుళాయి ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయప్రకాశరావు

గొల్లప్రోలు: గ్రామాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీఓ జయప్రకాశరావు అధికారులకు సూచించారు. మండలంలోని చేబ్రోలులో ఈఓపీఆర్డీ కుమార్‌తో కలసి శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో మంచినీటి కుళాయిలను తనిఖీ చేశారు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటి శాంపిల్స్‌ను సేకరించి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. దెబ్బతిన్న తాగునీటి పైపులైన్లకు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడమే కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసు, వీర్రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉదయ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం తనిఖీ



దివ్యాంగ విద్యార్థి గురించి అడిగి తెలుసుకుంటున్న నాగేశ్వరరావు, పుల్లయ్య

సామర్లకోట: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ, ఐఆర్‌సీ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, వారికి వచ్చిన స్టూడెంట్స్ కిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మండల పరిధిలో కిట్లు భద్రపర్చిన స్టాక్ పాయింట్ ఆయన పరిశీలించారు. ఒకటో తరగతి విద్యార్థులకు 469 డిక్షనరీలు, ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు 60,431, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు నోట్ బుక్స్ 56,052, బాలుర బూట్లు 3,956, బాలికల బూట్లు 4.134 వచ్చాయని ఎంఈఓ పి.పుల్లయ్య-2 వివరించారు. విద్యార్థులకు యూనిఫాం, బాగ్స్ రావాల్సి ఉందని తెలిపారు. అనంతరం చామంతి నాగేశ్వరరావు దివ్యాంగ విద్యార్థులకు ఐఈఆర్‌పీ ద్వారా నిర్వహించే ఇంటి వద్దనే విద్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని వీర్రాఘవపురం దివ్యాంగ విద్యార్థి యాళ్ల ప్రజ్ఞ సాయి ఇంటిని సందర్శించి అక్కడ జరిగిన ప్రత్యేక బోధనా పరికరాలను ఉపయోగించి ఐఈఆర్‌టీ ప్రత్యేక విద్య వివరాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

అ'పూర్వ' కలయిక



విశ్రాంత ఉపాధ్యాయ దంపతులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ కలయిక
- అప్పటి ఉపాధ్యాయుల సత్కారం



హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణను సత్కరించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 1972-73 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ కలయిక కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక రథం సెంటర్‌లోని గ్రాండ్ పార్కులో డాక్టరు వేల్పుల సత్యనారాయణ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రాష్ట్రాలలో నివాసం ఉంటున్న పూర్వ విద్యార్థులు కలుసుకొని అప్పటి విషయాలను గుర్తు చేసుకొని ఒకరిని ఒకరు పలకరించుకున్నారు.1972-73 విద్యా సంవత్సరంలో విద్య నేర్పిన గురువులు ఎస్‌టీఈవీ వేణుగోపాలాచార్యులు, ఆదిరాజు శ్రీరామచంద్రమూర్తి దంపతులను, ప్రస్తుత హెచ్‌ఎం తోటకూర సాయరామకృష్ణలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విశ్రాంత ఏఎస్సై వేల్పుల అప్పారావు, విశ్రాంత చీఫ్ ఇంజినీరు గాలి కేశవస్వామి, హైదరాబాద్ హైకోర్టు అడ్వకేటర్ పేరి బాలకృష్ణ, విశ్రాంత డ్రాయింగ్ టీచరు కట్టా బాబూరావు, వ్యాపార వేత్త నేతి చక్రధర్ బీవీ రాఘవులు, ఎస్‌వీ రమేష్, బీవీ సుబ్బారావు, ఎస్.మానవాళ్లు, పుట్టా వెంకటరమణ ఆత్మీయ సమేశనం ఏర్పాట్లు చేశారు. సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు.